సాక్షి

# మెట్రో-2బి డీపీఆర్‌లు కేంద్రానికి అందజేత



## మూడు కారిడార్లకు రూ.19,579 కోట్లు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు
- రూ.43,848 కోట్లతో 232 కి.మీ. మెట్రో నిర్మాణం

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మెట్రో రెండో దశ ‘బి’ఇక పట్టాలు ఎక్కనుంది. ఈ విభాగం కింద ప్రతిపాదించిన మూడు కారిడార్‌ల డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)లను శనివారం కేంద్రానికి సమర్పించినట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. కొద్దిరోజుల క్రితమే ఈ కారిడార్‌లకు కేబినెట్ ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. ఇటీవల పరిపాలన అనుమతులు కూడా లభించాయి. దీంతో మూడు కారిడార్‌ల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. ‘బి’కింద రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ. కారిడార్ నిర్మాణానికి రూ.7,168 కోట్లతో అంచనాలు రూపొందించారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.లకు రూ.6,946 కోట్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ.లకు రూ.5,464 కోట్ల చొప్పున ఈ మూడు కారిడార్‌ల నిర్మాణానికి మొత్తం రూ.19,579 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టనున్న ప్రాజెక్టు. దీంతో ఈ వ్యయంలో 30 శాతం.. అంటే రూ.5,874 కోట్లు రాష్ట్రం వాటా కాగా, కేంద్రం రూ.3,524 కోట్లు (18 శాతం) వెచ్చించనుంది. మరో 48 శాతం నిధులు.. అంటే రూ.9,398 కోట్లను అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల రూపంలో సేకరించనున్నారు. రూ.783 కోట్ల(4 శాతం)ను పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతి (పీపీపీ)లో వెచ్చించనట్లు ఎన్వీఎస్ తెలిపారు. మెట్రోరెండో దశ ‘ఏ’విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీ.లకు సుమారు రూ.24,269 కోట్లతో ఇప్పటికే డీపీఆర్‌లను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేసిన సంగతి తెలిసిందే. పలు సాంకేతిక అంశాలపై తలెత్తిన సందేహాలను సైతం మెట్రో అధికారులు కొద్ది రోజుల క్రితం నివృత్తి చేశారు. ‘ఏ’విభాగం కింద ఐదు కారిడార్‌లలో నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 36.8 కి.మీ., రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్ వరకు 11.6 కి.మీ., ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5.కి.మీ., మియాపూర్–పటాన్‌చెరు 13.4 కి.మీ., ఎల్‌బీనగర్–హయత్‌నగర్ 7.1.కి.మీ. మేర ఆయా మార్గాలను నిర్మించనున్నారు. మెట్రో రెండో దశలో ‘ఏ’, ‘బి’విభాగాల కింద మొత్తం 232 కి.మీ. నిర్మించేందుకు డీపీఆర్‌లను రూపొందించారు. ఇందుకోసం రూ.43,848 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా.

### ఇదీ హైదరాబాద్ మెట్రో..

- మెట్రో రెండో దశ ‘ఏ’విభాగంలో 5 కారిడార్లు 76.4 కి.మీ. వ్యయం అంచనా రూ.24,269 కోట్లు
- రెండోదశ ‘బి’విభాగంలో 3 కారిడార్లు 86.1 కి.మీ. వ్యయం అంచనా రూ.19,579 కోట్లు